# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...


TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 22 జూలై 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 365

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# ఉగ్ర గోదారి.. బిరబిరా కృష్ణమ్మ

- ఇరు పరీవాహకాల్లోని ప్రాజెక్టుల్లో జలకళ
- దుమ్ముగూడెం వద్ద 9.01 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- ఆలమట్టి నుంచి 1.50 లక్షల క్యూసెక్కులు దిగువకు..
- ఆలమట్టి, నారాయణపూర్ దిగువన అప్రమత్తం
- శ్రీశైలానికి ఉరకలెత్తుతున్న ప్రవాహం
- మేడిగడ్డ బ్యారేజీకి పెరుగుతున్న వరద



హైదరాబాద్: గోదావరికి వరద పోటెత్తుతోంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గత మూడు రోజులుగా ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరుల నుంచి వరద వచ్చి చేరుతోంది. తెలంగాణలోని గోదావరి పరీవాహకంలోనూ భారీ వర్షాలు పడుతుండటంతో కిన్నెరసాని, ముర్రేడు, కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ–అన్నారం బ్యారేజీల మధ్య వాగుల నుంచి పెద్దఎత్తున వరద వచ్చి గోదావరి నదిలో కలుస్తోంది. దీంతో ప్రవాహం పెరుగుతోంది. ఆదివారం సాయంత్రం నాటికి మేడిగడ్డ వద్ద 5.52 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. అన్నారం బ్యారేజీకి 16,850 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండడంతో 66 గేట్లు ఎత్తి అదేస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. ఇంద్రావతి కలిసిన అనంతరం సమ్మక్క బ్యారేజీ వద్ద 8.23 లక్షల క్యూసెక్కులు, దుమ్ముగూడెం సీతమ్మసాగర్ ఆనకట్ట వద్ద 9.01 లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి(43 అడుగులు)ని నది దాటింది. నదీ పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గకపోవడంతో మరికొంత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ జలాశయం(ఎస్సారెస్పీ)లోకి ఎగువ నుంచి 18,518 క్యూసెక్కుల వరద చేరుతోంది. నిర్మల్ జిల్లాలోని కడెం నారాయణరెడ్డి జలాశయంలో ఆదివారం ఉదయం నాలుగు వరద గేట్లు ఎత్తారు. మధ్యాహ్నానికి వరద తగ్గడంతో ఒక గేటు మూసేసి మూడు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు.

**శ్రీశైలానికి 96 వేల క్యూసెక్కులు**

కృష్ణా నదిలో ఎగువన వరద పెరుగుతోంది. కర్ణాటకలో ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాల కింద అప్రమత్తత ప్రకటించారు. ఆదివారం సాయంత్రానికి ఎగువ నుంచి భారీ ప్రవాహాలు వస్తుండటంతో ఆలమట్టి నుంచి దిగువకు 1.50 లక్షల క్యూసెక్కుల నీటి విడుదలను

ప్రారంభించారు. ఇది మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు కర్ణాటక జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. నారాయణపూర్ నుంచి 25 గేట్లు తెరిచి 1.45 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీంతో జూరాలకు వరద పెరిగింది. ప్రాజెక్టు 22 గేట్లను తెరిచారు.



## మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) వద్ద చర్చలు

దిల్లీ: మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) వద్ద చర్చలు జరుగుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం తాజా పరిస్థితులపై సమీక్షించారు. పార్టీ పెద్దలను కలవడానికి దిల్లీకొచ్చిన ఆయన సాయంత్రం ఇక్కడి తన అధికార నివాసంలో రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి రాహుల్‌బొజ్జా, జలవనరుల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌లతో చర్చించారు. ఒకవైపు మేడిగడ్డ మరమ్మతులు, పరీక్షలపై ఎన్‌డీఎస్‌ఏతో చర్చలు, మరోవైపు ఈ ప్రాజెక్టు నిర్మాణంలో వచ్చిన ఆరోపణలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రాజెక్టు పరిస్థితులను లోతుగా సమీక్షించారు. శనివారం ఎన్‌డీఎస్‌ఏ వద్ద జరిగిన సమీక్ష వివరాలను అడిగి తెలుసుకున్నారు. సోమవారం మరోసారి ఇంజినీర్లు, నిపుణులు తదితరులతో నిర్వహించే సమావేశంలో చర్చకు రాబోయే అంశాల గురించి

ఆరా తీశారు. మంత్రి ఉత్తమ్ తాజా స్థితిగతుల గురించి ముఖ్యమంత్రికి వివరించారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షలు, రావాల్సిన ఫలితాల గురించి తెలిపారు.



## పెద్దవాగుకు గండి.. అధికారుల నిర్లక్ష్యంపై మంత్రి తుమ్మల ఆగ్రహం

ఖమ్మం, అశ్వారావుపేట: పెద్దవాగు ప్రాజెక్టును తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. పెదవాగు ఆనకట్టకు పడిన గండిని చూశారు. నీట మునిగిన ఇళ్లను పరిశీలించారు. ఇళ్లు కోల్పోయిన వారికి తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం చేస్తామంటూ మంత్రి హామీనిచ్చారు. మరమ్మతు పనులపై అధికారులతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్‌తో సమీక్ష నిర్వహించారు. పెద్దవాగు గండికి అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు.



## రూ.700 కోట్లతో అల్యూమినియం టిన్నుల యూనిట్!

హైదరాబాద్: రాష్ట్రంలో పెట్టుబడులకు మరోసంస్థ ముందుకొచ్చింది. అల్యూమినియం టిన్నులను ఉత్పత్తిచేసే 'బాల్ బెవరేజ్ ప్యాకేజింగ్' సంస్థ రూ.700 కోట్లతో యూనిట్‌ను స్థాపించడానికి సంసిద్ధత వ్యక్తంచేసింది. బీర్లు, శీతలపానీయాలు, పర్‌ఫ్యూముల ఇండస్ట్రీకి అల్యూమినియం టిన్నులను ఈ సంస్థ సరఫరా చేస్తుంది. సంస్థ ఇండియా కార్పొరేట్ వ్యవహారాల అధిపతి గణేశన్, సంస్థ ప్రతినిధులు ఆదివారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. తమ సంస్థ విస్తరణ ప్రణాళికను వివరించారు. 'బాల్' సంస్థకు రాష్ట్రంలో అవసరమైన భూమి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పెట్టుబడులకు సంబంధించి పూర్తిప్రణాళిక సమర్పించాలని సూచించారు.

**500 మందికి ఉపాధి అవకాశాలు**

రాష్ట్రంలో ఈ సంస్థ ఏర్పాటుతో 500 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్రల్లో బీర్ల ప్యాకేజింగ్‌లో టిన్నుల వాడకం 25 శాతం వరకు ఉందని, రాష్ట్రంలో ఇది 2 శాతం లోపే ఉందని తెలిపారు. అవి కూడా మహారాష్ట్రలో బాట్లింగ్ అవుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో అల్యూమినియం టిన్నుల్లో బీర్లను బాట్లింగ్ చేయడానికి ఎక్సైజ్ విధానంలో కొన్ని మార్పులు చేయాల్సి ఉంటుందని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులతో చర్చిస్తానని తెలిపారు. 500 మి.లీ. పరిమాణంలో బీర్లను అల్యూమినియం టిన్నుల్లో ప్యాక్ చేయడం వల్ల కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ తగ్గి రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.285 కోట్ల అదనపు ఆదాయం వస్తుందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కోకాకోలా సంస్థ పెద్దపల్లి జిల్లాలో రూ.1000 కోట్లతో బాట్లింగ్ యూనిట్ ఏర్పాటుకు గతంలో సంసిద్ధత వ్యక్తం చేసిందని, ఆ యూనిట్‌కు 'బాల్' సంస్థ అల్యూమినియం టిన్నుల సరఫరాకు అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు.

## రాగల మూడురోజులూ.. తెలంగాణలో వర్షాలు!



హైదరాబాద్: రాగల మూడు రోజులు తెలంగాణ వ్యాప్తంగా ఉరుములు మెరుపులతోపాటు గంటకు 30కి.మీ నుంచి 40కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. చిలికా సరస్సు వద్ద కేంద్రీకృతమైన వాయుగుండం రాత్రి ప్రస్ఫుటమైన అల్పపీడన ప్రాంతంగా బలహీనపడిందని తెలిపింది. ఈ అల్పపీడనం వాయువ్య దిశలో కదిలి ఆదివారం ఉదయం ఒడిశా–ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. రానున్న 12 గంటల్లో ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో అల్పపీడనంగా బలహీనపడే అవకాశముందని వివరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఆదివారం కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆదిలాబాద్, కొమురంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల,

భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ,

సూర్యాపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని ప్రకటించింది. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపింది.

వేగుచుక్క
TELUGU DAILY NEWS
తెలంగాణ
2
సోమవారం 22 జూలై 2024

# అబద్దాల ప్రచారంలో ఆరితేరారు !

పదేళ్లపాటు రాష్ట్రాన్ని అడ్డదిడ్డంగా పాలించి, అక్రమాలకు పాల్పడి, అవినీతిని మూటకట్టుకుని, రాష్ట్రాన్ని దివాళా తీయించిన కెసిఆర్ కుటుంబం ఇప్పుడు కాంగ్రెస్‌ను ఎలా పడగొట్టాలా అన్న ఆలోచనలో పడింది. ఎమ్మెల్యేలు పార్టీని వీడిపోతున్నా..కట్టడి చేసుకోలేని వారు.. మళ్లీ తమదే రాజ్యం అని విర్రవీగుతున్నారు. అవినీతిలో మునిగి తేలిని వారికి అధికారలేమి ఉక్కపోతగా మారింది.అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై అదేపనిగా విమర్శలు ఎక్కుపెడుతోంది. నవ్విపోదురు గాక నాకేంటి అన్న చందంగా పదేపదే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విమర్శలు చేస్తోంది. తమ అవినీతి బయట పడకుండా, తమ అక్రమాలు ప్రజలు గుర్తించకుండా ఎదురుదాడి మార్గాన్ని బిఆర్ఎస్ నేతలు ఎంచుకున్నారు. హరీష్‌రావు, కెటిఆర్, నిరంజన్ రెడ్డి, జగదీశ్ రెడ్డిలు ఇందులో ప్రధాన భాగస్వాములుగా రోజూ విమర్శలు తప్ప మరో పనిలేకుండా సాగుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతిని వెలుగులోకి తీసుకొస్తూనే ఉంది. రైతుబంధు కింద గుట్టలకు, వెంచర్లకు, హైవేలకు నగదును అందజేసిన ఘనత మన కెసిఆర్ ప్రభుత్వానిది. రైతుభరోసా కింద ఇప్పుడు అర్హులకే సాయాం అందించాలని సర్కార్ నిర్ణయిం చింది. ఇలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అర్హులైన రైతులకే సాయం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పని చేసినా ఏదైనా పొరపాటు ఉందా లేదా అన్నది కూడా చూడకుండా భూతద్దం పెట్టి వెతికే పనిలో పడ్డారు. ఏడు నెలలకే బ్రహ్మాండం బద్దలు అయినట్లు.. తామంతా బంగారం తాపడం చేస్తే..కరగనాకినట్లుగా గగ్గోలు పెడుతున్నారు. ప్రజలు వీరికి సిగ్గులేదా అని ఈసడించుకుంటున్నారు. ఉన్న ఎమ్మెల్యేలు జారుకుంటు న్నారు. మొన్న పార్లమెంట్ ఎన్నికల్లో కర్రుకాల్చి వాతలు పెట్టారు. అయినా వారిలో మార్పు రావడం లేదు. ఇంకా ఎలాంటి వాతలు పెడితే మార్పు వస్తుందో ప్రజలు గుర్తించి, ఆపని చేయాల్సి ఉంది. దాదాపు ఏడున్నర లక్షల కోట్లు అప్పులు చేశారు. విద్యుత్ కొనుగోళ్లలో భారీ అవినీతికి పాల్పడ్డారు. అవినీతిపై విచరాణ జరక్కుండా కోర్టులకు ఎక్కారు. విచారణ జరపరాదని కోరుకున్నారు. కానీ సుప్రీం సుతిమెత్తగా మొట్టికాయలు వేసిందనే చెప్పాలి. విచారణ కమిషన్ జడ్జిని మార్చండి అని చెప్పిందే తప్ప..విచారణ ఆపమని చెప్పలేదు. దీనికి కూడా సుప్రీం తమకే అనుకూలంగా చెప్పిందని కెటిఆర్ తదితరులు జబ్బలు చర్చుకున్నారు. విద్యుత్ ఒప్పందాలపై అవినీతి జరక్కుంటే ..కెసిఆర్ మహాశయుడు ఎందుకు విచారణ ఆపమంటున్నారో చెప్పడం లేదు. అవినీతి లేకుంటే బాజాప్తా కమిషన్ ముందు తన వాదన వినిపించ వచ్చు. ప్రజలు కేవలం కెసిఆర్ కుటుంబ అహంకారంతో విసిగిపోయి కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఈ విషయం తెలియకుండా ప్రజలు పొరపాటు కాంగ్రెస్‌కు ఓటేశారని ప్రజలను కూడా తప్పుపడుతున్నారు. నిజానికి కాంగ్రెస్ వారు అధికారం చేపట్టే నాటికి రాష్ట్రం ఏడున్నల లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. అయినా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని భరోసా ఇస్తోంది. ప్రతిపక్ష పార్టీల విమర్శలకు చెక్ పెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నారు. మహలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద ప్రతి ఇంటికి 200 యూనిట్ల కరెంట్ బిల్లును ఉచితంగా అమలు చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్‌కు రూ.500లను కూడా అమలు చేస్తూ పేద ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గిస్తోంది. కానీ బిఆర్ఎస్ నేతలు ఆరింట ఒక్కటే అమలవుతోందని గుడ్డిగా విమర్శలు చేసి నవ్వులపాలు అవుతున్నారు. ఇక అన్నింటిని మించిన రైతు రుణమాఫీకి కూడా శ్రీకారం చుట్టింది. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ 'రైతు రుణమాఫీ' అమలుకు శ్రీకారం చుట్టారు. ఆగస్టు 15 గడువు కంటే ముందే

ఏకకాలంలో రుణమాఫీ చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు మొదలు పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో రుణాలు ఉన్న రైతుల ఖాతా సంఖ్య 70లక్షలే. ఇంకా దాదాపు 6.36 లక్షల మంది రైతులకు రుణాలు ఉన్నా రేషన్ కార్డులు లేవు. వారందరినీ కూడా దృష్టిలో ఉంచుకుని రుణమాఫీ చేయాలని నిర్ణయించారు. 2014 ఎన్నికల్లో తెలంగాణలోని రైతులందరికి లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని కేసీఆర్ చెప్పారు. అధికారంలోకి వచ్చాక విడతల వారీగా రూ.25వేల రూపాయలు చొప్పున లక్ష వరకు చేశారు. ఆ లబ్ది కూడా అరకొర రైతులకే లబ్ది చేకూరింది. కేంద్ర ప్రభుత్వం అందజేసే ఫసల్ బీమాను కూడా అహంకారపూరిత ధోరణితో కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేయలేదు. దీంతో పంట నష్టం వాటిల్లినప్పుడు ఎంతోమంది రైతులు ఆర్థికంగా చితికిపోయారు. రాష్ట్ర ప్రభుత్వమైనా ఆదుకుందా అంటే అదీ లేదు. ఏనాడూ బీఆర్ఎస్ నాయకులు రైతుల పొలాలను పరిశీలించిన పాపాన పోలేదు. రైతులు ఏం పంట వేయాలో తామే చెబుతామని, రైతులను ఆర్థికంగా బలోపేతం చేస్తామంటూ నష్టాల ఊబిలోకి దించారు. రబీలో పంట వేసుకోవాలా వద్దా, వేస్తే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా లేదా అన్న సంశయంతో చాలా మంది రైతులు వ్యవసాయానికి దూరం అయ్యారు. తెచ్చిన అప్పులు కట్టలేక ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వాటిని కూడా గత ప్రభుత్వం దాచిపెట్టింది. రైతు బీమా కింద నగదును అందజేశారంటే ఎంతమంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నారో అర్థం అవుతుంది. ఇంతేగాక రైతులకు సంకెళ్లు వేసిన ఘనత కూడా మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది.

# దాశరథి జీవితం కవులకు ఆదర్శం కావాలి.







**ప్రజావాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న పిలుపు.**

**ప్రశ్నించే వాడే నిజమైన కవి అని వెల్లడి.**

**ఘనంగా దాశరథి కృష్ణమాచార్య 99వ జయంతి సభ.**

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జులై 21:**

ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్య స్ఫూర్తితో మెరుగైన సమాజం కోసం అడుగులు వేయాలని, కవులకు ఆయన జీవితం ఆదర్శం కావాలని ప్రజావాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న పిలుపునిచ్చారు.

దాశరథి కృష్ణమాచార్య 99వ జయంతి సభ నిజామాబాద్ నగరంలోనీ టీఎన్ జిఓ భవన్ లో ఆదివారం సిర్పలింగయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోరేటి వెంకన్న హాజరై, మాట్లాడారు. దాశరథి కృష్ణమాచార్య నిజాం నిరాంకుశ పాలన, రజాకారుల ఆకృత్యాలకు బలవుతున్న తెలంగాణను చూసి చలించారని, మన ప్రాంత ప్రజల కోసం గొంతువిప్పారనీ అన్నారు. తన రచనల ద్వారా ఊరూరా తిరిగి ప్రజల్లో చైతన్యం రగిలించారనీ అన్నారు. తెలంగాణ పోరాటానికి వేగుచుక్క గా నిలిచిన దాశరథి కృష్ణమాచార్య 1925 జులై 22న మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరులో పుట్టారని, చిన్నప్పటినుంచే రచనలు చేశారని అన్నారు. మానవీయ సమాజాన్ని స్వప్నించి రచనలు చేసిన మహాకవి దాశరథి అని, ఏ మత గ్రంధాల్లో లేని మానవత విషయాలను కవితల రూపంలో చెప్పిన మహాకవి దాశరథి అని అన్నారు. ప్రశ్న వేయకుంటే కవి కవి కాదని, ప్రశ్న వేసినవాడే నిజమైన కవి అని అన్నారు. వ్యవహారిక సత్యాన్ని తన రచనల రూపంలో చెప్పిన గొప్ప కవి దాశరథి అని అన్నారు.



కవి శ్రమజీవుల పక్షాన ఉండాలి

కవుల నుంచి పసిపాప నవ్వులాంటి కవిత్వం రావాలని గోరేటి సూచించారు. కవి శ్రమజీవుల పక్షాన ఉండాలనీ, మనుషుల్లో వివేకం నశిస్తుందని, క్రూరత్వం పెరిగుతుందని సమాజానికి ఇది మంచిది కాదని గోరేటి అన్నారు.

వివేకవంతులు సైతం ఆత్మహత్యలు చేసుకునే దయనీయ పరిస్థితి నెలకొందని, కొందరు లాభాపేక్షతో అన్నీ కల్తీ చేస్తున్నారని వెంకన్న ఆవేధన వ్యక్తం చేశారు. కవులు, రచయితలు ప్రజల కోసం పది నిమిషాలు కేటాయించి, వారి కష్టాలను రాస్తే దాశరధికి నిజమైన నివాళి అర్పించినట్టు అవుతుందన్నారు

.అంతకు ముందు దాశరథి చిత్రపటానికి వెంకన్న పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో జయంతి ఉత్సవాల నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఎన్.దాసు, అష్ట గంగాధర్, క్యాతం చంద్రశేఖర్, సాయిబాబా, తిరుమల శ్రీనివాస్, సాయి లవోల, దారం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# బీడి"జీవన భృతి " రూ" 4016 కు పెంచాలి.

**2014 కటాప్ డేట్ ఎత్తివేసి,కార్మికులందరికీ జీవనభృతి ఇవ్వాలి.**

**తెలంగాణ బహుళజన బీడీ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు డిమాండ్.**

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జులై 21:**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో బీడి కార్మికులకు ఇచ్చిన హామీ అమలు చేయాలని, బీడి జీవన భృతి రూ"4016 కు పెంచడంతో పాటు 2014 సంవత్సర కటాప్ డేట్ ఎత్తివేయాలని తెలంగాణ బహుళజన బీడీ కార్మికసంఘం (బిఎల్ టియూ) రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు డిమాండ్. నగరంలోని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బిఎల్ టీయూ) రాష్ట్ర కార్యాలయం లో ఆదివారం బీడీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిరాములు మాట్లాడుతూ,

తెలంగాణ రాష్ట్రములోని బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికులకు, ప్యాకర్లకు, బట్టి, చటన్, టేకేదార్ తదితర అన్ని తరగతుల కార్మికులకు 2016,రూ,ల జీవన భృతి ఇవ్వకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆంక్షలు విదించిందని అన్నారు. 2014 పిబ్రవరి 28 కటాప్ డేట్




పెట్టడం వల్ల 2015 మార్చి నుండి పిఎఫ్ నెంబర్లు ఉన్న వేలాది మంది కార్మికులకు నేటికి జీవన భృతి రావడం లేదన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కటాఫ్ డేట్ ఎత్తివేసి బీడీ కార్మికులందరికీ రూ" 4016 జీవన భృతి ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. కాని అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా బీడి కార్మికుల హామీలపై ఊసు ఎత్తడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 2014 పిబ్రవరి 28 కటాఫ్ ను తక్షణమే ఎత్తి వేసి, బీడీ పరిశ్రమ లో పనిచేస్తున్న అందరికీ రూ"4016 జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

లేదంటే తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం ఆద్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమం చేపడుతామని అన్నారు. ఈ నెల 23 నుండి జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో బీడీ కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం పూనుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.జగదీష్, రాష్ట్ర కోషదికారి సయ్యద్, జిల్లా కార్యదర్శి వేణు, సుజాత, కల్పనా, లక్ష్మి, రేణుకా తదితరులు పాల్గొన్నారు.జష్త్రబఝ్ఘు: ......

# ఢిల్లీలో తెలంగాణ పరువు తీయకండి

హైదరాబాద్: ఎత్తిపోతల పథకాలకు కరెంటు ఖర్చు అవుతుందని ఆ ఎత్తిపోతలు లేకపోతే తెలంగాణ కరువు ప్రాంతంగా, వలసలకు నెలవుగా, రైతుల ఆత్మహత్యలకు నిలయంగా మారుతుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అభిప్రాయియపడ్డారు. తెలంగాణ భౌగోళిక పరిస్థితిని అర్థం చేసుకుని అవగాహనతో మాట్లాడాలని, కనీసం ఢిల్లీలో మాట్లాడేటప్పుడయినా తెలంగాణ పరువు తీయవద్దని ఆదివారం ఒక ప్రకటనలో పాలకులకు హితవు పలికారు. డ్యాం సేఫ్టీ అథారిటీతో సమావేశం అనంతరం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అవాకులు, చెవాకులు పేలడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలోనే మేడిగడ్డ ప్రాజెక్టు ఆరడుగులు కుంగిపోయిందని ఉత్తమ్ అంటున్నారని, అది కేవలం ఒక దురదృష్టకర ఘటన అని, అలా జరగాలని ఏ ప్రభుత్వమూ కోరుకోదని పేర్కొన్నారు. "2022లో సంభవించిన వరద గోదావరి చరిత్రలోనే అతి పెద్దది, మేడిగడ్డ బరాజ్ వద్ద 28లక్షల క్యూసెక్కులపైగా వరద ప్రవాహం వచ్చింది దాంతో బ్యారేజి కింది సిమెంటు బ్లాకులు అక్కడక్కడ లేచిపోయి ఉన్నందున చిన్న లీకేజీలు బుంగలుగా మారి సొరంగంగా ఏర్పడ్డాయి, ఈ సొరంగం 2023 వరదల అనంతరం మూడు పిల్లర్ల కుంగుబాటుకు కారణమైంది" అని వివరించారు. మేడిగడ్డ పునాదులు బలపరిచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పిన మంత్రి మళ్లీ మేడిగడ్డ వద్ద మట్టి పరీక్షలు సాధ్యం కాలేదని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. వరద వచ్చేంతవరకు సాంకేతిక పరీక్షలు నిర్వహించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యమే కారణమైతే ఇందుకు ఆ ప్రభుత్వమే బాధ్యత వహించాలని హరీశ్ డిమాండ్ చేశారు.

# అమ్మవారు అందరినీ చల్లగా చూడాలి.



**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జులై 21**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**

**నగరంలో ఘనంగా బోనాల పండుగ.**

అమ్మవారు ప్రతి ఒక్కరినీ చల్లగా చూడాలని, ఎటువంటి కష్టాలు రాకుండా కాపాడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలో ఆదివారం బోనాల పండుగ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దన్ పాల్ పాల్గొని, మహాలక్ష్మి అమ్మవారికి బోనం ఎత్తుకున్నారు. %జు% సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయ పండుగలలో ఒకటి బోనాల పండుగని, రాష్ట్ర వ్యాప్తంగా ఆశడమాసంలో ప్రజలందరు భక్తి శ్రద్దలతో బోనం చేసి అమ్మవారిని కొలవడం అనవయితీగా వస్తుందని అన్నారు. సకాలంలో వర్షాలు కురిసి రైతన్నలు అధిక పంటలు పండించాలని, పిల్లజల్లా, గొడ్డు గోదా అన్నింటిని కాపాడాలని అమ్మవారిని పూజించడం జరుగుతుందని, స్వయంగా అమ్మవారే తమ ఇంటికి వచ్చినట్లు భక్తులందరు భావిస్తారని అన్నారు. అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లే అని, అమ్మవారు నగర ప్రజలందరిని అష్టఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో 22 వ డివిజన్ కార్పొరేటర్ పంచారెడ్డి లావణ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.